
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రంగారెడ్డి

5 జిల్లా వార్తలు

ఆదివారం 6 జూలై 2025

ఏ దారి ఎటు పోతుందో..!

రహదారుల వెంట ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు చెట్ల మధ్య ఉండి కనిపించడం లేదు. దీంతో ఏ దారి ఎటు పోతుందో.. వచ్చేది ఏ గ్రామమో తెలియక వాహనదారులు తికమక పడుతున్నారు. రాళ్లగూడెం నుంచి శంషాబాద్ వెళ్లే దారిలో ఉన్న సూచిక బోర్డులకు చెట్ల కొమ్మలు అడ్డుగా రావడంతో వాహనదారులు తమ గమ్యస్థానానికి చేరుకోవడానికి అవస్థ పడాల్సి వస్తోంది.

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి జిల్లా





పారదర్శకంగా ప్లాట్ల కేటాయింపు

- ఫార్మాసిటీ భూ బాధితులకు లాటరీ పద్ధతిన పంపిణీ
- మీర్కాన్‌పేటలో వెంచర్‌ను పరిశీలించిన కలెక్టర్ నారాయణరెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

కందుకూరు, జులై5 (ఆంధ్రజ్యోతి): కందుకూరు, యాచారం మండలాలలోని ఫార్మా భూ బాధితులకు ప్లాట్లు అందజేసేందుకు ఏర్పాటు చేసిన వెంచర్‌ను శనివారం సాయంత్రం కలెక్టర్ నారాయణరెడ్డి పరిశీలించారు. ఈ నెల 7వ తేదీ నుంచి కేటగిరి వారీగా లాటరీ పద్ధతిలో రైతులకు పూర్తి యాజమాన్య హక్కులను కల్పించే విధానాలను, ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసే పద్ధతిని కరపత్రాల ద్వార రైతులకు వివరించాలని రెవెన్యూ, టీఎస్ఐఐసీ అధికారులకు సూచించారు. మండల పరిధిలోని మీర్కాన్‌పేట, పంజగూడ, తిమ్మాయిపల్లి రెవెన్యూలో 600 ఎకరాలలో హెచ్ఎండీఏ తరహాలో వెంచర్‌ను అభివృద్ధి చేసిన విషయం తెలిసిందేనని... ఇందులో మొదటగా 60గజాల ఇంటి స్థలం కేటాయించిన రైతుల లిస్టును తయారు చేయాలన్నారు. సోమవారం వారికి లాటరీ ద్వారా ప్లాట్లను కేటాయించాలని సూచించారు. లాటరిని రైతుల చేతుల మీదుగా తీయించాలని, వారు రాకపోతే అధికారులు తీయాలన్నారు. మంగళవారం 121 గజాల ఇంటి స్థలం కేటాయించిన రైతులకు లాటరీ తీయాలన్నారు. కేటగిరి వారీగా 100శాతం ప్లాట్లను కేటాయించి వారికి దానిని చూపించాకే మరో కేటగిరి రైతులకు లాటరీ తీయాలన్నారు. ఏటీసీ కేంద్రంలో ఏర్పాటు చేసిన లాటరీ విధానానికి ముందుగా ఇక్కడికి వచ్చే రైతులకు సూచనలు, సలహాలను ఇవ్వడానికి నాలుగు హెల్ప్‌డెస్కు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. లాటరి ద్వార ప్లాటు వచ్చిన రైతు నుంచి ఆధార్ కార్డు లేదా పాన్‌కార్డు జిరాక్స్‌లు తీసుకొని ఫాం 32పై సంతకం తీసుకొని రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. రిజిస్టర్ డాక్యుమెంట్‌కు కావాల్సిన బాండు పేపర్ (50రూపాయలు) రుసుము ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ శ్రావణ్‌కుమార్, ఆర్డీవోలు జగదీశ్వర్‌రెడ్డి, అనంతరరెడ్డి, తహసీల్దార్‌లు కె.గోపాల్, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

రూ.3.5లక్షల గంజాయి పట్టివేత

- కార్మికులే టార్గెట్‌గా విక్రయాలు
- నిందితుడి అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న జిల్లా ఎక్సైజ్ ప్రొహిబిషన్ అధికారి ఉజ్వలారెడ్డి

షాద్‌నగర్ అర్బన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల కార్మికులే టార్గెట్‌గా విక్రయిస్తున్న గంజాయి చాక్లెట్లు, ఎండు గంజాయిని పట్టుకుని, విక్రయదారుడిని అరెస్టు చేసినట్టు జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి ఉజ్వలారెడ్డి వెల్లడించారు. షాద్‌నగర్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బిహార్ రాష్ట్రానికి చెందిన పింటూ సింగ్ అనే కార్మికుడు నందిగామ శివారులోని అయ్యప్ప మందిరం సమీపంలో చిన్న కిరాణం కొట్టు పెట్టుకుని అందులో గంజాయిని విక్రయిస్తున్నాడు. పక్కా సమాచారం మేరకు దుకాణంపై దాడి చేసి 9.13 కిలోల గంజాయి చాక్లెట్లు, 2.25 కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. గంజాయిని విక్రయిస్తున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. బిహార్, బెంగాల్ ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన ఎండు గంజాయి, గంజాయి చాక్లెట్లను కార్మికులకు మాత్రమే విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సీఐ శేఖర్, ఎస్ఐలు ఆర్.శ్రీనివాస్‌నాయక్, ఎం. సునీత తదితరులు పాల్గొన్నారు.

నాటడం.. నరకడం!

రహదారి పక్కన వృక్షాలపై గొడ్డలి వేటు

- విద్యుత్ తీగలకు తగులుతున్నాయని నరికివేత
- అవగాహన లేకుండా మొక్కలు నాటడంతో అవస్థలు
- అధికారుల అలసత్వంతో రూ.లక్షల ప్రజాధనం వృథా

పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు వానలు సమృద్ధిగా కురవాలనే ఉద్దేశంతో ప్రతీ సంవత్సరం మొక్కలు నాటే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోంది. లక్షల రూపాయలు వెచ్చించి వన మహోత్సవం పేరిట రహదారుల పక్కన మొక్కలు నాటుతున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ మొక్కలు సరైన ప్రాంతాల్లో నాటకపోవడంతో సర్కార్ లక్ష్యం నీరుగారిపోతోంది. పైన విద్యుత్ తీగలు ఉన్నాయనే స్పృహ లేకుండా కింద మొక్కలు నాటిస్తున్నారు. అవి ఏపుగా పెరిగిన తర్వాత చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తగిలి ప్రమాదకరంగా మారుతున్నాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో పాటు ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. దీంతో విద్యుత్ తీగల కింద ఉన్న చెట్లను, వాటి కొమ్మలను అడ్డంగా నరికించేస్తున్నారు. ఇంత ఖర్చు పెట్టి నిర్లక్ష్యంగా మొక్కలను నాటడమెందుకు... ఆ తర్వాత నరకడమెందుకని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజాధనం దుర్వినియోగమవుతుందని వాపోతున్నారు.



షాద్‌నగర్ జూనియర్ కళాశాల వద్ద విద్యుత్ వైర్ల కింద పెరిగిన చెట్లు

షాద్‌నగర్ అర్బన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): వాతావరణం కాలుష్యం కాకుండా అడవులను పెంచాలని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రతీ గ్రామ పంచాయతీలో 10 లక్షల మొక్కలను పెంచే సామర్థ్యం కలిగిన నర్సరీని ఏర్పాటు చేశారు. నర్సరీలలో కానుగ, గుల్మోర, టేకు, నేరేడు, వేప, పెల్టోఫామ్, టేకోమా, సీతాఫలం, ఈత, నీలగిరి, మునుగ, నిమ్మ, దానిమ్మలాంటి మొక్కలను పెంచుతున్నారు. ప్రభుత్వ స్థలాల్లో పెంచుతున్న ఒక్కొక్క నర్సరీకి లక్షా 20 వేల నుంచి లక్షా 70 వేల రూపాయలను ఖర్చు చేస్తున్నారు. మొక్కలను ప్రభుత్వ స్థలాల్లో, రోడ్లకు ఇరువైపులా నాటిస్తున్నారు. రైతులకు టేకు, జామ, ఈత మొక్కలను అందిస్తున్నారు. ఇంటి యజమానులకు పండ్లు, పూల మొక్కలను పంపిణీ చేస్తున్నారు. కమ్యూనిటీ మొక్కలు కొంత మేర పెరుగుతున్నా రహదారి మొక్కల మనుగడ ప్రశ్నార్థకంగా

మిగతా 8వ పేజీలో...



బుచ్చిగూడలో నరికివేసిన చెట్ల కొమ్మలు

ప్రభుత్వ నిధులను వృథా చేయొద్దు



వృక్ష సంపదను పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలని కేంద్ర ప్రభుత్వం ఇతోధికంగా నిధులు వెచ్చిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పథకం కింద మొక్కలను నాటిస్తుంది. అయితే రోడ్లకు ఇరువైపులా విద్యుత్తు లైన్ల కింద ఎత్తు పెరుగని మొక్కలను మాత్రమే నాటాలి. మూడేళ్ళు పెంచిన తరువాత నరికేసే వాటిని నాటొద్దు.

ఎన్.శ్రీవర్ధన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

హక్కుల సాధనకు ఏకం కావాలి

బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్



సమావేశమైన నాయకులు

మహేశ్వరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : సామాజిక న్యాయ సాధన, సమానత్వం కోసం రాజకీయాలకతీతంగా బీసీ రాజ్యాధికార సమితి కృషి చేస్తుందని వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ అన్నారు. బీసీ రిజర్వేషన్ల అమలు కోసం శనివారం తుక్కుగూడలోని ఓ హోటల్‌లో నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల సమయంలో బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. హక్కుల సాధన కోసం తలపెట్టిన కోటి మంది బీసీ కార్యకర్తల సభ్యత్వ నమోదును ఊరూరా ముమ్మరంగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లోపం.. సీసీ రోడ్లు ధ్వంసం

- నిర్మాణం జరిగిన కొన్నాళ్లకే మట్టి దారులుగా మారుతున్న వైనం

6



ఆస్ట్రేలియాలో అవార్డు అందుకుంటున్న శ్యామల(ఫైల్)



Sunday Special

ఆమెది దళిత వ్యవసాయ కూలీ కుటుంబం. చదువుపై ఆసక్తితో ఎల్ఎల్‌బీ పూర్తి చేసింది. చిన్ననాటి నుంచి ప్రజా సమస్యలను చూస్తూ పెరిగింది. దాంతో అప్పటి నుంచే పుస్తకాలు చదవడం ప్రారంభించింది. సాహిత్యాన్ని ఆకలింపు చేసుకొని తాను రచనలను మొదలుపెట్టింది. తాను రచించిన నవలలు పర భాషల్లోనూ అనువాదం కావడంతో దేశవ్యాప్త ప్రాచుర్యం పొందాయి. అనేక ఉత్తమ పురస్కారాలు సైతం ఆమెను వరించాయి. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ గ్రామానికి చెందిన సాహితీవేత్త, రచయిత్రి గోగు శ్యామల ప్రస్థానంపై ప్రత్యేక కథనం.

శభాష్.. శ్యామల!

- నవలా రచనల్లో ఆమె మేటి
- మహిళా సాహిత్యం, సాధికారతపై అధ్యయనం
- ప్రాచుర్యం పొందిన 'వాడపిల్లల' కథలు
- రాష్ట్ర ప్రభుత్వం నుంచి మహిళా పురస్కారం
- గోగు శ్యామల సాహిత్య ప్రయాణంపై కథనం

తాండూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): పెద్దేముల్ గ్రామానికి చెందిన బాలయ్య, అనంతమ్మ దంపతుల రెండో సంతానం శ్యామల. వారిది వ్యవసాయ కుటుంబం. 1969లో జన్మించిన ఆమె చిన్నతనం నుంచే పరిచయమున్న తాండూరు మండలం చెనిగేష్‌పూర్ గ్రామానికి చెందిన బైండ్ల విజయ్‌కుమార్‌ను 1990లో పెళ్లి చేసుకుంది. అభ్యుదయ భావాలు ఉన్న విజయ్‌కుమార్ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా పని చేశారు. వీరికి ఇరువురు కుమారులు పెద్దకుమారుడు రవికాంత్ ఢిల్లీలో ప్రైవేటు ఉద్యోగం చేస్తుండగా, చిన్న కుమారుడు రోషన్ యూకేలో ఉద్యోగం చేస్తూ స్థిరపడ్డాడు. దళిత కుటుంబం నుంచి

మిగతా 7వ పేజీలో...

అంబేడ్కర్, పూలే నాకు ఆదర్శం



డాక్టర్ బీఆర్. అంబేడ్కర్, మహాత్మా జ్యోతి రావు పూలే నాకు స్ఫూర్తి. నేను చదువుకునే రోజుల్లో ప్రజల సమస్యలు చూడటం, పాటలు పాడటం, ప్రసంగాలు చేయడం వల్ల రచయితగా మారిపోయాను. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల్లో పురస్కారం అందుకోవడం సంతోషానిచ్చింది. - గోగు శ్యామల

అర్హులకు పింఛన్లు మంజూరు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సంఘం ప్రతినిధులు

ఇబ్రహీంపట్నం, జూలై 5(ఆంధ్రజ్యోతి): అర్హులైన వారందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని దివ్యాంగుల హక్కుల పోరాట జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్కోని రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎన్‌పీఆర్‌డీ ప్రతినిధులతో కలిసి ఇబ్రహీంపట్నం తహసీల్దారు, ఎంపీడీవోలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్పీఆర్డీ ప్రతినిధులు తాళ్లనిర్మల, తిరుమల్‌రెడ్డి, సుభాష్, సతీష్‌గౌడ్, అస్లాం, బాలమణి, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య భూతాన్ని కట్టడి చేయండి



పరిశ్రమల అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక కాలుష్యాన్ని సమర్థవంతంగా అరికట్టి, కార్మికులకు భద్రతను పెంచాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం పరిశ్రమల శాఖ జీఎం యాదయ్య, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జంగయ్య, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈ సాజీదాలతో ఎమ్మెల్యే సమీక్షను నిర్వహించారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో 124 హైరిస్క్ పరిశ్రమలు, 65 లోరిస్క్ పరిశ్రమలు, 200 మీడియం రిస్క్ పరిశ్రమలు ఉన్నాయని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ తెలిపారు. స్పాంజ్ ఐరన్, ఐరన్, టెక్స్‌టైల్స్, కెమికల్, లెడ్ రిసైకల్, టైర్ల తదితర కంపెనీలలో అధికంగా కాలుష్యం వస్తున్నట్టు గుర్తించామన్నారు. కార్మికుల భద్రతపై యాజమాన్యాలకు సూచనలు చేస్తున్నామని తెలిపారు. షాద్‌నగర్ పట్టణ సమీపంలోని ఎలికట్ట ప్రాంతంలో ఉన్న పరిశ్రమల నుంచి కాలుష్యం విపరీతంగా వస్తుందని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజుల్లో పరిశ్రమలను తనిఖీ చేసి, కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. తనిఖీల సమయంలో, కాలుష్య నియంత్రణ విషయంలో ఏదైనా సమస్య వస్తే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఎన్కేపల్లిలో ప్రభుత్వ భూమి సర్వే



ప్రభుత్వ భూమి వద్ద పోలీసుల బందోబస్తు

300గజాల స్థలానికి ఒప్పుకుంటే..

మొయినాబాద్ రూరల్, జూలై5(ఆంధ్యజ్యోతి): మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎన్కేపల్లి రెవెన్యూలో గోశాలను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శనివారం సర్వే నంబర్ 108లోని 99.14 ఎకరాల ప్రభుత్వ భూమిని చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. ఇతరులెవరూ అక్కడికి రాకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ సమయంలో ఎన్కేపల్లి గ్రామస్తులు కొందరు అక్కడకు వచ్చి ఆందోళన చేశారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని సర్వేను కొనసాగించారు. రెండు గంటల పాటు చేసిన సర్వేలో చేవెళ్ల డివిజన్‌కు సంబంధించి మొయినాబాద్, షాబాద్, శంకర్‌పల్లి, చేవెళ్ల మండల తహసీల్దార్లు తమ సిబ్బందితో పాల్గొన్నారు. 300 గజాలకు స్థలాన్ని తీసుకోవడానికి ఒప్పుకుంటే ఒక్క రోజులోనే రిజిస్ట్రేషన్ చేసిస్తామని ఆర్డీఓ చంద్రకళ ఎన్కేపల్లి రైతులకు సూచించినట్లు సమాచారం. ఈ భూమిని ప్రభుత్వం తీసుకోవడం ఖాయమని స్పష్టం చేశారని తెలిసింది. స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య చెప్పడంతో ఎకరానికి 300 గజాల స్థలం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

నిరుపేదల హక్కుల కోసం ఉద్యమాలు

- సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య



మంచాల, జూలై 5(ఆంధ్రజ్యోతి): నిరుపేదల హక్కుల సాధన కోసం ఉద్యమాలు కొనసాగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.యాదయ్య పిలుపునిచ్చారు. పార్టీ మండల స్థాయి రాజకీయ శిక్షణాతరగతులు మంచాలలోని కృష్ణమూర్తి భవన్‌లో ప్రారంభమయ్యాయి. ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రావుల జంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్‌రెడ్డి, బి.శ్యాంసుందర్, మండల కమిటీ సభ్యులు మార బుగ్గరాములు, పి.గోపాల్, ఏ.లెనిన్, పి.కృష్ణ, కె.జంగయ్య, ఏ.యాదయ్య, వై.జగన్, బి.సుధాకర్, పి.విజయ, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

నాణ్యతా లోపం.. సీసీ రోడ్లు ధ్వంసం

- వేసిన కొన్నాళ్లకే పూర్తిగా లేచిపోయిన సీసీ
- మట్టి రోడ్లుగా మారుతున్న వైనం.. ప్రజల ఇబ్బందులు
- క్వాలిటీపై అధికారులు పట్టించుకోకే ఈ పరిస్థితి

యాచారం, జూలై 5(ఆంధ్రజ్యోతి): అధికారుల అలసత్వం, ప్రజాప్రతినిధుల నిర్లక్షంతో ఏళ్లపాటు మన్నవలసిన ప్రజా పనులు కొన్నేళ్లకే పాడవుతున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లు మట్టి రోడ్లుగా మారాయి. రోడ్లు పగుళ్లిచ్చి ఎక్కడికక్కడ సీసీ లేచిపోతున్నాయి. సీసీ వేసిన సమయంలో అధికారులు నాణ్యత ప్రమాణాలు చూడకుండానే బిల్లులివ్వడంతోనే నేడు ఈ పరిస్థితి నెలకొంది. చిన్నతూండ్లలో పదేళ్ల క్రితం బీసీ వాడలో వేసిన సీసీ రోడ్డు ధ్వంసమైంది. పంచాయతీ ఆఫీసుకు కొద్ది దూరంలో సీసీ పాడై భారీ గుంతలేర్పడ్డాయి. వాననీరు రోడ్డుపై నిలుస్తూ గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. సీసీ రోడ్డు కాస్తా మట్టి రోడ్డులా మారింది. తాటిపర్తిలో బీసీ వాడలో సీసీ ధ్వంసమైంది. సీసీ రోడ్డు వేసిన కొద్ది రోజులకే రోడ్డు తవ్వి భూగర్భ డ్రైనేజీ పైపులు వేశారు. దీంతో మట్టి రోడ్డుగా మారింది. గొల్లగూడలో సీసీ రోడ్డు పాడవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నానక్‌నగర్‌లో సీసీ రోడ్డు తగినంత ఎత్తుగా వేయక వర్షానికి మట్టి కొట్టుకొచ్చి రోడ్డుపై చేరుతోంది. కుర్మిద్దలో పలు వాడల్లో సీసీ రోడ్డు ధ్వంసమైంది. తండా వెళ్లే దారిలో సీసీ రోడ్డు పాడవడంతో గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చౌదర్‌పల్లి చౌరస్తాలో సీసీ రోడ్డు పాడై ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడ్డాయి. తక్కళ్లపల్లి, కొత్తపల్లి గ్రామాల కాలనీల్లో సీసీ రోడ్లు ధ్వంసమయ్యాయి. కుర్మిద్ద తండాలో సీసీ రోడ్డు పాడయిపోయింది. మేడిపల్లిలో సీసీ రోడ్డు మొత్తం పెళ్లలుగా లేచిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, కనీసం ప్యాచ్ వర్కయినా చేయించడం లేదని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. మల్కీజ్‌గూడలో సీసీ రోడ్డు ఖరాబైందని అధికారులకు చెప్పినా బాగు చేయించడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. యాచారంలో ప్రధాన సీసీ రోడ్డుపై పలుచోట్ల గుంతలేర్పడ్డాయి. ఈ రోడ్డుపై తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటుండడంతో స్థానికులు సిమెంట్ వేయించి బాగు చేశారు. అధికారులు సీసీ రోడ్ల పాడైనచోట మరమ్మతులు చేయించాలని, నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.


చిన్నతూండ్లలో మట్టి రోడ్డులా మారిన సీసీ రోడ్డు

పాడైన సీసీ రోడ్లను వెంటనే బాగు చేయించాలి



పదేళ్ల కింద వేసిన సీసీ రోడ్లు పాడయ్యాయి. బురుజు వెనకబస్తీలో సీసీ లేచిపోయి మట్టిరోడ్డుగా మారింది. అక్కడ కొత్తగా సీసీ రోడ్డు వేయించేందుకు నేను చాలా వరకు ప్రయత్నం చేశాను. పంచాయతీలో నిధుల్లేక సీసీ వేయలేదు. అధికారులు నిధులిచ్చి సీసీ రోడ్లను బాగుచేయాలి. ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం.

- బి.రాజశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్, కర్మిద్ద

నిధుల మంజూరుకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు



గ్రామంలో రూ.రెండున్నర కోట్లతో కొత్తగా సీసీ రోడ్లు బాగుచేయించాలని, పాడైన రోడ్లకు మరమ్మతులు చేయించాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కోరాం. నిధులు కేటాయించాలని విన్నవించాం. త్వరలోనే అవసరమైన సీసీ రోడ్లకు నిధులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

- డి.రమేశ్, మాజీ సర్పంచ్, తాటిపర్తి


తాటిపర్తిలో సీసీ లేచిపోయిన రోడ్డు

పోతులవాగు కబ్జాపై విచారణ


పోతులవాగును పరిశీలిస్తున్న ఈఈ మధుసూదన్‌రెడ్డి, అధికారులు

ధారూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధి అల్లాపూర్ శివారులో పొలం కొన్న ఓ రియల్టర్ పక్కనే ఉన్న వాగును కబ్జాచేసి కోట్‌పల్లి ప్రాజెక్టు కెనాల్‌ను ధ్వంసం చేశాడు. దీనిపై రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు శనివారం వాగును, కెనాల్‌ను పరిశీలించారు. పోతులవాగులో భారీగా మట్టిపోసి, రాళ్లు పేర్చి కబ్జాచేసి పొలంలో కలుపుకున్నారు. కోట్‌పల్లి ప్రాజెక్టు కెనాల్‌నూ ధ్వంసం చేశాడు. ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మధుసూదన్‌రెడ్డి, డీఈలు రవికుమార్, భాస్కర్‌గౌడ్, రెవెన్యూ అధికారులు పోతులవాగును సర్వే చేశారు. రియల్టర్ వాగును కబ్జా చేసినట్టు గుర్తించారు. వాగు కబ్జాతో పాటు, కెనాల్‌ను ధ్వంసం చేసిన రియల్టర్ ఎవరో వివరాలు సేకరిస్తున్నామని ఈఈ తెలిపారు. వాగు, కెనాల్ ధ్వంసంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఇదిలా ఉంటే అటవీ భూమిని సైతం కబ్జా చేశాడని అల్లాపూర్ రైతులు తెలిపారు. సర్వే చేస్తే అటవీ భూమి ఎంత ఆక్రమించాడో తేలుతుందని అధికారులను కోరారు. కాగా సర్వే నంబరు 11ను సర్వే చేయించేందుకు డీఎఫ్‌వోకు నివేదించామని ధారూరు ఫారెస్టు రేంజర్ రాజేందర్ తెలిపారు.

బాసర ట్రిపుల్ ఐటీకి 8 మంది విద్యార్థుల ఎంపిక


ఎంపికైన ఇర్విన్ హై స్కూల్ విద్యార్థులు

మాడ్గుల, జులై 5(ఆంధ్రజ్యోతి): ఇర్విన్ పాఠశాల విద్యార్థులు 8 మంది టెన్త్ పరీక్షల్లో ఉత్తమ గ్రేడ్ సాధించి బాసర ట్రిపుల్ ఐటీ కోర్సుకు ఎంపికయ్యారని హెచ్ఎం పర్వతాలు శనివారం తెలిపారు. అశ్విని, సౌమ్యశ్రీ, స్పందన, రమ్యశ్రీ, జునైద్, స్నేహిత్, రోహిత్, వైష్ణవి ట్రిపుల్‌ఐటీకి ఎంపికయ్యారని చెప్పారు.

ఘనంగా జగన్నాథ రథయాత్ర



మేడ్చల్‌లో నిర్వహిస్తున్న జగన్నాథుడి రథం ఊరేగింపు

మేడ్చల్ టౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): పూరీ జగన్నాథస్వామి రథ యాత్రను శనివారం మేడ్చల్‌లో ఘనంగా నిర్వహించారు. రథ యాత్రను పట్టణంలోని రాయల్ ఫంక్షన్ హాల్ నుంచి ప్రారంభించి బాలాజీనగర్, ఉమానగర్, జాతీయ రహదారి మీదుగా నిర్వహించి ప్రజలకు స్వామి వారి దర్శనం కల్పించారు. యాత్రలో స్థానికంగా భక్తులు పెద్దఎత్తున పాల్గొన గా కృష్ణ పరమాత్మ నామస్మరణంతో పట్టణం మార్మోగింది.

స్పీకర్‌ను విమర్శిస్తే ఊరకోం



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మర్పల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను విమర్శించేస్థాయి మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌ది కాదని మండల కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో పార్టీ సీనియర్ నాయకులు రామేశ్వర్, దివాకర్, సురేశ్‌లు మాట్లాడారు. రెండు రోజుల క్రితం మాజీ ఎమ్మెల్యే ఆనంద్.. స్పీకర్‌ను విమర్శిస్తూ.. రాజ్యాంగ బద్ధ పదవీలో ఉన్న ఆయన రాజకీయాలు ఎలా ఎలా మాట్లాడతారంటూ వ్యాఖ్యానించడం పూర్తిగా అసంబద్ధం అన్నారు. స్పీకర్ పదవిలో ఉన్నా ఆయనను ఎన్నుకున్న నియోజకవర్గ ప్రజల గురించి తప్పక మాట్లాడతారనే విషయం మాజీ ఎమ్మెల్యే గుర్తుంచుకోవాలన్నారు. ఆయన ముఖ్య కార్యకర్తల సమావేశంలోనే మాట్లాడారన్నారు. బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి జరగలేదన్నారు. ప్రసాద్‌కుమార్ ఎమ్మెల్యేగా వికారాబాద్ నియోజకవర్గానికి రూ.800కోట్లతో రోడ్ల పనులు చేయిస్తున్నా రని తెలిపారు. ఆనంద్ తన పదవీ కాలంలో సొంత, అనుచరుల ఆస్తులు పెంచుకున్నారే ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. మండలంలో రోడ్ల వెడల్పునకు రూ.12వేల కోట్లు మంజూరు చేయించారని, మండలానికి 780 ఇళ్ల మంజూరు అయ్యాయని తెలిపారు. ఎవరైనా స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది హెచ్చరించారు. సమావేశంలో సీనియర్ నాయకుడు రాములుయాదవ్, పార్టీ మండలాధ్యక్షుడు సురేశ్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మల్లేశ్‌యాదవ్, నాయకులు ఉప్పరి నాగేశ్, రాచన్న, అశోక్‌రెడ్డి, అశోక్, అబ్రహం, రతన్, శ్రీనివాస్, వినోద్‌స్వామి, హర్షవర్ధన్ పాల్గొన్నారు.

కేజీబీవీలో బోర్ వేయించిన తహసీల్దార్



రిగ్గుకు టెంకాయ కొడుతున్న ఎస్‌వో శ్వేతారెడ్డి

రంగారెడ్డి అర్బన్/చేవెళ్ల : గత పదేళ్లగా చేవెళ్ల లోని కేజీబీవీ విద్యార్థినులు నీటి కోసం పాట్లు పడుతున్నారు. మిషన్ భగీరథ నల్లా ఏర్పాటు చేసినా నీరు సరిపోవడం లేదు. పదేళ్ల నుంచి రోజూ ట్యాంకర్ తెప్పించుకుంటున్నారు. ట్యాంకర్ సమయానికి రాక ఇబ్బందులు పడుతున్నారు. కస్తూర్బా విద్యాలయాన్ని సందర్శించిన సమయాల్లో ప్రజాప్రతినిధులకు, అధికారులకు విద్యార్థినులు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు కూడ మొరపెట్టుకున్నారు. రెండు రోజుల క్రితం చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య కేజీబీవీని సందర్శించారు. అక్కడ విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యను తెలుసుకున్నారు. రెండు రోజుల్లో బోరు వేయిస్తానని బాలికలకు భరోసా ఇచ్చారు. మాట ప్రకారం ఆయన శనివారం బోరు బండిని కేజీబీవికి పంపించారు. సంవృద్ధిగా నీరు పడాలని దేవుడిని ప్రార్థిస్తూ కేజీబీవో ఎస్‌వో శ్వేతారెడ్డి కొబ్బరికాయ కొట్టి రిగ్గు మిషన్‌ను ప్రారంభించారు.


సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు భూపాల్

ఆదిభట్ల, జూలై 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని జూలై 9న దేశవ్యాప్తంగా తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. శనివారం బొంగ్లూర్ ఓఆర్ఆర్ సర్కిల్ వద్ద హెచ్ఎండీఏ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం తెచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేయాలని, సార్వత్రిక సమ్మెలో కార్మికులంతా పాల్గొనాలని కోరారు. ఎన్డీఏ ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయన్నారు. ఏపీలో ఇటీవల మంత్రి వర్గ సమావేశంలో 8గంటల పనిదిన్నాన్ని 10 గంటలకు పెంచారని గుర్తుచేశారు. సమ్మెలో కార్మిక లోకం పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీష్, కార్మికులు బిక్షపతి, కుమార్, ప్రభాకర్, రాజు, నరసింహ పాల్గొన్నారు.

వైభవంగా మొహర్రం



పీర్ల వద్ద వేడుకల్లో పాల్గొన్న నాయకులు

కడ్తాల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మక్తమాదారంలో మొహర్రం పండగ శనివారం రాత్రి ప్రారంభమైంది. పీర్ల చావిడిని ముస్తాబు చేశారు. ఏటా మొహర్రం పండగ వేడుకలను ఇక్కడ భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. పీర్ల పండగలో కడ్తాల్ మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ వైస్ఎంపీపీ ఆనంద్ పాల్గొన్నారు. వారు పీర్లను దర్శించుకొని కొద్దిసేపు అసోయ్ దులా ఆడారు. ముస్లింలు వారిని శాలువాలతో సన్మానించారు. కులమతాలకతీతంగా పీర్ల పండగను జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సులోచనసాయిలు, మాజీ ఎంపీటీసీ మంజులచంద్రమౌళి, మాజీ ఉపసర్పంచ్ గణేశ్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ లాయక్అలీ, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సత్యంగౌడ్, రిపోర్టర్ రామకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు, స్థానిక ముస్లింలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వంద కోట్లతో మున్సిపాలిటీ అభివృద్ధి

షాద్‌నగర్ అర్బన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ మున్సిపాలిటీలో రూ.వంద కోట్లతో ఏళ్లపాటు మన్నేలా వివిధ అభివృద్ధి పనులను చేపడుతున్నామని ఎమ్మెల్యే, ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు. శనివారం షాద్‌నగర్‌లోని ఆరు వార్డుల్లో 21.59కోట్లతో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. మూడవ వార్డులో మూడు కోట్లతో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ పనులు, ఆరో వార్డులో సీసీ రోడ్లు, ఏడో నాలుగు సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులు, తొమ్మిదో వార్డులో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజి పనులు, పార్కు అభివృద్ధి, పదో వార్డులో రోడ్లు, యూజీడీ పనులు, 21వ వార్డులో సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అభివృద్ధి పనులను నాణ్యతతో సకాలంలో పూర్తిచేయిస్తామని, పట్టణాభివృద్ధి దశల వారీగా ముందుకు సాగుతుందని వీర్లపల్లి తెలిపారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ సునీత, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, మాజీ చైర్మన్ ఎ.విశ్వం, కాంగ్రెస్ నాయకులు ఇబ్రహీం, కె.చెన్నయ్య, జమ్రుద్‌ఖాన్, రఘునాయక్, తిరుపతిరెడ్డి, సర్వర్‌పాషా, శ్రావణి, ఎ.శ్రీనివాస్‌రెడ్డి, రమాదేవి, ముబారక్, శ్రీశైలంగౌడ్, ప్రవీణ్, యాదగిరి, టీడీపీ నాయకుడు కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఎన్కతల గ్రామంలో శిథిలావస్థకు చేరిన మినీ ఆడిటోరియం

నిర్వహణ లేని మినీ ఆడిటోరియం

మోమిన్‌పేట్, జూలై 5(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఎన్కతలలో 2019లో రూ.19లక్షల ఎంపీ నిధులతో మినీ ఇండోర్ ఆడిటోరియాన్ని నిర్మించారు. ఇందులో బ్యాడ్మింటన్, క్యారమ్స్ చెస్ లాంటి ఆటలాడేందుకు క్రీడాసామగ్రి సమకూర్చారు. కొన్నేళ్లుగా నిర్వహణ లేక ఆడిటోరియం శిథిలావస్థకు చేరింది. యువతీ, యువకులు, విద్యార్థులు ఆటలాడడం లేదు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించి అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

600 మందికి కంటి పరీక్షలు



వైద్య శిబిరం ప్రారంభానికిత జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు, జూలై 5 (ఆంధ్రజ్యోతి):ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని సీకేఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఏర్పాటుచేసిన మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ప్రజల కోసం ఏర్పాటు చేసిన శిబిరానికి ఆమనగల్లు, కల్వకుర్తి, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి, వెల్దండ మండలాల నుంచి సుమారు 800మంది హాజరయ్యారు. రాఘవేందర్‌రెడ్డితో కలిసి రాంరెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ దామోదర్‌రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. జడ్జి శ్రీదేవి సందర్శించి నిర్వాహకులను అభినందించారు. చెన్నై శంకర నేత్రాలయ సహకారంతో ఈ శిబిరంలో 600 మందికి కంటి పరీక్షలు చేశారు. 300 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. 35 మందికి దృష్టిలోపమున్నట్లు గుర్తించి ఐఓఎల్ ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఈ నెల 13వ తేదీ వరకు శిబిరాన్ని నిర్వహిస్తామని రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజలు దీనికి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంధత్వ నివారణ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా ముందుకు తీసుకుపోతున్నట్టు చెప్పారు. నేత్ర సంరక్షణలో అజాగ్రత్త తగదన్నారు. ఫౌండేషన్ సేవలను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పవన్‌కుమార్ రెడ్డి, బాల్‌రాజ్, రమేశ్, శ్రీరాములు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు, నర్సరీ పరిశీలన



నర్సరీని పరిశీలిస్తున్న వెంకటనారాయణ

కేశంపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండల ప్రత్యేకాధికారిగా మెప్మా పీడీ వెంకటనారాయణ శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ మేరకు మండల సిబ్బందితో సమావేశం నిర్వహించి, అధికారులను పరిచయం చేసుకున్నారు. శాఖలవారీగా వివరాలు తెలుసుకున్నారు. అనంతరం చౌలపల్లిని సందర్శించిన నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. బిల్లులు వచ్చాయా? అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. నర్సరీని పరిశీలించారు. మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్య, ఏపీవో అజీజ్, కార్యదర్శి వెంకటేష్, మాజీ సర్పంచ్ గూడ వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తికాని బ్రిడ్జి నిర్మాణం



అసంపూర్తిగా ఉన్న చర్లగూడ గ్రామానికి వెళ్లే బ్రిడ్జి పనులు

● అసంపూర్తి పనులతో ప్రజల ఇబ్బందులు

షాబాద్, జూలై 5(ఆంధ్రజ్యోతి): మూడేళ్ల కింద నిర్మాణం ప్రారంభించిన బ్రిడ్జి పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదర్కొంటున్నారు. చర్లగూడకు వెళ్లే బ్రిడ్జి నిర్మాణానికి 2022లో ప్రభుత్వం రూ.7.7కోట్లతో పనులు చేపట్టింది. అయితే పనుల పురోగతి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా మారింది. త్వరగా బ్రిడ్జి పనులను పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. ఇందుకు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చొరవచూపాలంటున్నారు.

పనులను త్వరగా పూర్తి చేయాలి



ఈ వంతెన నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలి. వర్షాలు ఎక్కువ కురుస్తే ఈ వాగు నీరు పొలాల నుంచి పారి పంటలు పాడవుతాయి. అలాగే ప్రజలు, రైతులు రాకపోకలు సాగించేందుకు, వాహనాలు వెళ్లేందుకు వాగుపై రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చొరవ చూపాలి.

- అంజనేయులు, మాల సంక్షేమ సంఘం జిల్లాధ్యక్షుడు

సమస్యను ఉన్నతాధికారులకు విన్నవించాం



పనులకు బిల్లు రానందున కాంట్రాక్టర్‌కు పనులను నిలిపేశాడు. గ్రామస్తుల సమస్యలు, నిలిచిన పనుల అంశంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయాం. నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది. త్వరలో పనులు ప్రారంభమయ్యేలా చూస్తాం.

- విజయ్‌కుమార్, డీఈఈ, పంచాయతీ రాజ్

ప్రజల ఆకాంక్షలకనుగుణంగా పాలన



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, జూలై5(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్షలకనుగుణంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం పాలన కొనసాగిస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి మహర్దశ పట్టిందని తెలిపారు. ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల మండలాల్లో శనివారం ఎమ్మెల్యే నారాయణరెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి వేగవంతంగా పూర్తిచేయాలని సూచించారు. అనారోగ్యంతో మృతిచెందిన చంద్రాయన్‌పల్లికి చెందిన కసిరెడ్డి వసంతమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆమె కుమారుడు మాజీ సర్పంచ్ పురుషోత్తంరెడ్డి, కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ప్రజలకు మెరుగైనపాలనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంస్కరణలు అమలు చేస్తుందని చెప్పారు. రాష్ట్రాభివృద్ధి, పేదల ఆర్థికాబివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని, రాజకీయాలకు తావు లేకుండా అభివృద్ధిలో ప్రజలంతా పాలుపంచుకోవాలన్నారు. నియోజకర్గంలోని అన్ని గ్రామాలు, తండాలకు బీటీ రోడ్లు నిర్మించి రవాణా సౌకర్యం కల్పించేందుకు కార్యాచరణను అమలు చేస్తున్నట్లు చెప్పారు. రూ.600కోట్లతో రోడ్లను కొత్తగా వేస్తున్నట్టు వెల్లడించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునీకరించడంతో పాటు అధునాతన భవనాలు నిర్మిస్తున్నట్లు నారాయణరెడ్డి చెప్పారు. మెరుగైన విద్యుత్ సరఫరా కోసం 8 సబ్ స్టేషన్లు, 650 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన పనులనూ పూర్తిచేసి వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు భట్టు కిషన్‌రెడ్డి, సూదిని కొండల్‌రెడ్డి, జగన్, సంపత్‌కుమార్, రమేశ్‌గౌడ్, తల్లోజు రామకృష్ణ, అంజన్‌రెడ్డి, బాబ,విజయ్ రాథోడ్, కల్లు రమణారెడ్డి పాల్గొన్నారు.

పోస్టల్‌లో ఆధునిక పరిజ్ఞానం

▸ ఐటీ 2.0ద్వారా వేగవంతంగా సేవలు

▸ సౌత్ ఈస్ట్ డివిజన్ పోస్టాఫీసు సీనియర్ సూపరింటెండెంట్ హైమవతి



రంగారెడ్డి అర్బన్, జూలై5(ఆంధ్రజ్యోతి): ఐటీ 2.0 పేరుతో వినియోగదారులకు మరింత వేగవంతమైన, సమర్థవంత సేవలందించేందుకు పోస్టల్ శాఖ కృషి చేస్తోందని సౌత్ ఈస్ట్ డివిజన్ పోస్టాఫీసు సీనియర్ సూపరింటెండెంట్ హైమవతి శనివారం తెలిపారు. హైదరాబాద్ సౌత్ ఈస్ట్ డివిజన్‌లో ఈ సేవలు ఈ నెల 8నుంచి అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. జూలై 7న సౌత్ ఈస్ట్ డివిజన్ పరిధిలోని పోస్టాఫీసుల్లో ఎలాంటి లావాదేవీలు జరగవని, వినియోగదారులు సహరించాలని ఆమె కోరారు.

శభాష్.. శ్యామల!

(ఐదో పేజీ తరువాయి..)

ఉద్భవించిన కవిరత్నం శ్యామల.. చిన్ననాటి నుంచి పుస్తక పఠనం, రచనలు చేయడం అలవాటు ఉన్న ఆమె రచయితగా ఎదిగారు.

సీనియర్ రీసెర్చ్ స్కాలర్‌గా..

తాండూరులో ఇంటర్ వరకు చదివిన శ్యామల హైదరాబాద్ అంబేద్కర్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ పూర్తి చేసి ఆంధ్రమహిళా సభలో ఎల్ఎల్‌బీ చదివారు. ఉమెన్స్ రీసెర్చ్ సెంటర్‌లో సీనియర్ స్కాలర్‌గా పని చేశారు. ప్రస్తుతం మహిళా సాహిత్యం, సాధికారిత, సంస్కృతికంపై అధ్యయనం చేశారు.

శ్యామల రచనలు ఇవే..

వాడ పిల్లలు - తెలుగు కథలు అనేక భాషల్లో అనువాదం జరిగింది. ఆంగ్ల, మలయాళం, ఒరిస్సా భాషల్లో ప్రాచుర్యం పొందింది. నల్ల పొద్దు, నల్లరేగడి సాళ్లు, అంకితం- కథా సంకలనం, ఏనుగంత తండ్రి కన్నా ఎకుల బుట్టంత తల్లి నయం, నేనే బలాన్ని- సదాలక్ష్మి బతుకు కథలు వంటివి ఆమె రచించారు.



రీసర్చ్ స్కాలర్‌గా పనిచేస్తున్న శ్యామల(ఫైల్)

అవార్డులు - పురస్కారాలు

2006లో ఉమ్మడి రాష్ట్రాల్లో తెలుగు భాషా సంఘం ఆధ్వర్యంలో తెలుగు భాష విశిష్ట పురస్కారాన్ని అందుకున్నారు. 2009లో తెలుగు యూనివర్సిటీ నుంచి వాసిరెడ్డి రంగనాయకమ్మ స్మారక పురస్కారం, రవి రాజు ట్రస్ట్ గండ పెండేరాన్ని శ్యామలకు బహూకరించారు. ఇండియా-ఆస్ట్రేలియా సొసైటీ ఆధ్వర్యంలో ఆస్ట్రేలియాలో జరిగిన సదస్సుకు తెలుగు రాష్ట్రాల నుంచి శ్యామల హాజరై ఆ దేశంలో కవి సమ్మేళనంలో సన్మానం పొందారు. అలాగే గతంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన రాష్ట్ర ప్రభుత్వం నుంచి మహిళా పురస్కారాన్ని అందుకున్నారు. లండన్‌లోని గార్డెన్ పత్రికలో ఆమె గురించి వ్యాసం రావడం గమనార్హం.

ఫలించిన కృషి

● బషీరాబాద్ జూనియర్ కాలేజీలో 68 మంది విద్యార్థుల అడ్మిషన్లు



జూనియర్ కళశాలలో ప్రారంభమైన తరగతులు

బషీరాబాద్, జూలై5(ఆంధ్రజ్యోతి):బషీరాబాద్‌లో కొత్తగా ఏర్పాటైన జూనియర్ కళాశాలలో అడ్మిషన్లకు అధ్యాపకుల కృషి ఫలించింది. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్.నర్సింహారెడ్డి నేతృత్వంలో అధ్యాపకులు ఏప్రిల్, మే నెలల్లో టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థుల సమాచారాన్ని సేకరించారు. గ్రామాలకు వెళ్లి విద్యార్థులు ప్రభుత్వ కాలేజీల్లో చేరాలని కోరారు. ఉత్తమ బోధన ఉంటుందని, పుస్తకాలు, డ్రెస్సులు అందజేస్తామని వివరించారు. ప్రైవేట్ కాలేజీల్లో చేరితే తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడుతుందని తెలియజెప్పారు. మండలానికి మంజూరైన జూనియర్ కాలేజీలో విద్యార్థుల్లేక గతేడాది ఇక్కడ అడ్మిషన్ పొంది తాండూరులో చదివారని, విద్యార్థుల సంఖ్య పెరిగితే మండల కేంద్రంలోనే కొనసాగుతుందని తెలిపారు. టెన్త్ ఫలితాలు వచ్చిన అనంతరం గ్రామాల్లో మరోసారి లెక్చరర్లు పర్యటించారు. కళాశాల ప్రారంభం రోజున 48 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ఇప్పుడు సంఖ్య 68కి చేరింది. బషీరాబాద్ జడ్పీ బాలుర పాఠశాలలో అదనపు గదుల్లో ఇంటర్ ఫస్టియర్ తరగతులు కొనసాగుతున్నాయి. కొత్త కాలేజీలో ప్రస్తుతం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌తో పాటు అన్ని గ్రూపుల బోధనకు 8 మంది అధ్యాపకులు ఉన్నారు. టెన్త్ సప్లిమెంటరీ ఫలితాలు కూడా వచ్చాయి. ఈ క్రమంలో 100మంది వరకు విద్యార్థులను కాలేజీలో చేరే అవకాశాలు ఉన్నాయని, టెన్త్ పాసైన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లా డేందుకు అధ్యాపకులు యోచిస్తున్నారు. ఇదిలా ఉంటే ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవతో నిరీక్షణకు తెర పడగా, కాలేజీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయాలి



డబుల్ బెడ్‌రూం ఇళ్లను సందర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

మంచాల, జూలై 5(ఆంధ్రజ్యోతి): లింగంపల్లిగేటు వద్ద నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే 96 డబుల్‌బెడ్‌రూం ఇళ్లను నిర్మించామని చెప్పారు. మంచాల, లింగంపల్లి, నోముల, రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు చెందిన నిరుపేద కుటుంబాలకు ఇళ్లను కేటాయించామని చెప్పారు. పూర్తయిన ఇట్టి ఇళ్లకు తాగునీరు, విద్యుత్ సరఫరా కోసం రూ.30లక్షలు మంజూరు చేయించామని తెలిపారు. అదే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో గృహ ప్రవేశాలు జరగలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 18నెలలైనా పనుల్లో పురోగతి లేదన్నారు. ప్రజా సమస్యలపై ప్రజాప్రతినిధికి పట్టింపే లేకుండా పోయిందని విమర్శించారు. గృహ నిర్మాణాలకు అనుసంధానంగా ఎన్ని శాఖలుంటాయో తెలియదని ఎద్దేవా చేశారు. పట్టించుకునే నాథుడు లేకనే లబ్ధిదారులు గృహప్రవేశాలు చేశారని, వీరిని కేసుల పేరుతో ఇబ్బంది పెట్టొద్దని పోలీసులను కోరారు.పెండింగ్ పనులు చేయకుంటే లబ్ధిదారులతో కలిసి ఆందోళనల్లో తానూ పాల్గొంటానని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రమేష్, బహదూర్, సత్తు వెంకట రమణారెడ్డి, డి.రవి, బి.కిషన్‌రెడ్డి, గంట విజయ్, కరుణాకర్‌రెడ్డి,బాలరాజ్, అమరేందర్‌రెడ్డి, వీరేష్, చంద్రయ్య, మహేందర్, శంకర్, బద్రీనాథ్‌గుప్తా, జానీపాషా, జంగయ్య, శేఖర్, చెన్నయ్య, జంగారెడ్డి, నవాజ్, ఇందిర, నర్మద, పి.సుకన్య పాల్గొన్నారు.

కవల శిశువులకు దాతల చేయూత

ఆమనగల్లు, జూలై 5(ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ తండా వాసులు తమ ఉదారత చాటుకున్నారు. అనాథ పిల్లల వైద్య చికిత్సకు చేయూతనిచ్చారు. చిన్నారులకు తోడున్నామని మనోధైర్యాన్ని కల్పించారు. తండాకు చెందిన వివాహిత మధు ఇటీవల ఆత్మహత్య చేసుకుంది. ఆమె భర్త గోపి రిమాండ్‌లో ఉన్నాడు. దీంతో వారి కవల పిల్లలు(18 నెలలు) అనాథలయ్యారు. తాత సంరక్షణలో ఉన్న చిన్నారుల పోషణ ఇబ్బందిగా మారింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు రూ.10వేలు, మాజీ ఎంపీపీ అనితవిజయ్ రూ.5వేలు, తండా వాసులంతా కలిపి రూ.52,800 పోగుచేసి శనివారం అందజేశారు. ఐక్యత ఫౌండేషన్ ద్వారా ప్రతీ నెల రూ.5వేలు ఇస్తామని ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ప్రకటించినట్లు రాములు చెప్పారు. నాయకులు కృష్ణ, తావుర్య, శంకర్, పాండు, విజయ్, రాజ్‌కుమార్, రమేశ్, మణిపాల్, రఘునాయక్, తండా యువకులు, తదితరులు ఉన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న రాములు, విజయ్, నాయకులు


విరాళం ఇస్తున్న మద్దెల జ్యోతి- కుమారస్వామి దంపతులు

ఆలయ రాజగోపురం నిర్మాణానికి విరాళం

షాద్‌నగర్ అర్బన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలోని శివ మారుతీ గీత అయ్యప్ప మందిర రాజగోపుర నిర్మాణానికి స్థానిక వ్యాపారి మద్దెల జ్యోతికుమారస్వామి దంపతులు రూ.5 లక్షల విరాళం ఇచ్చారు. శనివారం ఆలయ ఆవరణలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు లష్కర్ ఆంజనేయులకు అందజేశారు. ఆలయ అభివృద్ధికి విరాళం ఇచ్చే అవకాశం రావడం పూర్వ జన్మసుకృతమని కుమారస్వామి ఆనందం వ్యక్తం చేశారు. దంపతులిద్దరినీ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు లష్కర్ ఆంజనేయులు, రెటికల్ నందీశ్వర్, దాస కృష్ణయ్యలు సన్మానించి, అభినందించారు. అదేవిధంగా మధురాపురం గ్రామానికి చెందిన నంద్యాల అనిత పుల్లారెడ్డి దంపతులు రూ.11,116 విరాళాన్ని అందజేశారు.

వేంకటేశ్వరాలయం అభివృద్ధికి విరాళం

షాద్‌నగర్ పట్టణానికి ముఖద్వారంగా వెలిసిన శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి పట్టణానికి చెందిన శివ శంకర్‌గౌడ్, దాస రమేష్‌లు రూ.42వేల రూపాయల విరాళాన్ని ఇచ్చారు. ఆలయ ఆవరణలో మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులుకు విరాళాన్ని ఇచ్చారు. ప్రధాన పూజారి శ్రీనివాసాచార్యులు, యశ్వంత్‌గౌడ్, ఒగ్గు కిషోర్, వినోద్, కృష్ణయ్య, రాంభూపాల్, గంధం ఆనంద్, లష్కర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన జైపాల్ యాదవ్

ఆమనగల్లు, జూలై 5(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను శనివారం కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ పరామర్శించారు. సాధారణ వైద్య పరీక్షల నిమిత్తం హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో చేరిన కేసీఆర్‌ను మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్‌రాజ్, మాజీ రాజ్యసభ సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డిలతో కలిసి కేసీఆర్‌ను, వైద్యులను ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


గ్రామస్తులతో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశం

చేవెళ్ల, జూలై 5(ఆంధ్ర జ్యోతి) పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ వెంకటేశం అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని దామరగిద్ద వార్డులో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని, తడి, పొడిచెత్తను వేరు చేయాలన్నారు. సకాలంలో ఇంటి పన్ను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నాటడం.. నరకడం!

(ఐదో పేజీ తరువాయి)

మారింది. పదేళ్లుగా అనాలోచితంగా మొక్కలు నాటడం ఆ తర్వాత వాటిని నరకడం చేస్తున్నారు.

ప్రతీ మొక్కకు రూ.1027 ఖర్చు

రహదారులకు ఇరువైపులా నాటి పెంచుతున్న ప్రతీ మొక్కకు ప్రభుత్వం రూ.1,027 ఖర్చు చేస్తుంది. నర్సరీలో మొక్కను పెంచడానికి రూ.17, గోతి తీసి నాటడానికి రూ.120, మూడేళ్ల పాటు నీరు పోయడానికి రూ.162, ఎరువులు వేయడానికి రూ.75, కాపలాదారుడికి రూ.653 డబ్బు వెచ్చిస్తున్నారు. రహదారులకు ఇరువైపులా నాటుతున్న మొక్కలు ఎంత ఎత్తు పెరుగుతాయి.. ఏవి ఎక్కడ నాటాలనే ఆలోచన లేకుండా అధికారులు హడావిడిగా వన మహోత్సవ కార్యక్రమాన్ని చేపడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి.

అవగాహనతో మొక్కలను నాటాలి

రహదారుల పక్కన మొక్కలు నాటే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా విద్యుత్తు లైన్ల కింద నాటే మొక్క జాతి లక్షణమేమిటి..? అది ఎంత ఎత్తు పెరుగుతుంది..? ఫలాలను ఇస్తుందా? కలప పనికి వస్తుందా..? పరిశీలించాల్సి ఉంటుంది. విద్యుత్ హెచ్‌టీ, ఎల్‌టీ లైన్లు 6 నుంచి 7 మీటర్ల ఎత్తులో ఉంటాయి. వాటి కింద 4 నుంచి 5 మీటర్ల ఎత్తు పెరిగే మొక్కలను మాత్రమే నాటాలి. కానీ ఆలోచన లేకుండా ఏది పడితే అది నాటి, టార్గెట్ పూర్తి అయిందని నివేదికలు పంపించి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు.


కేశంపేట రోడ్డులోని కమ్మదనం శివారులో నరికివేసిన చెట్ల కొమ్మలు (ఫైల్)

చెట్లకొమ్మలు తగిలి ప్రమాదాలు

విద్యుత్ లైన్ల కింద నాటిన చెట్ల కొమ్మలు తరచూ ప్రమాదాలు జరిగి వినియోగదారులు నష్టపోతున్నారు. ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసినప్పుడు చెట్ల కొమ్మలు ఊగి విద్యుత్తు వైర్లు ఒకదానితో మరొకటి కలిసి మంటలు వస్తున్నాయి. కొన్ని సందర్భాలలో వైర్లు తెగిపడి ప్రమాదాలు జరుగుతున్నాయి. వైర్లు ఒకదానితో మరొకటి తగిలినప్పుడు గృహోపకరణాలు, విద్యుత్తు పంపుసెట్లు కాలిపోయి వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వ వ్యయంతో నాటి పెంచుతున్న మొక్కలు వృక్షాలుగా ఎదిగి విద్యుత్ ప్రమాదాలకు కారణమై నష్టాన్ని కలిగిస్తున్నాయి. వాటిని తిరిగి ప్రభుత్వ ఖర్చుతోనే నరికించాల్సి వస్తుంది.

రహదారి వృక్షాల మనుగడ ప్రశ్నార్థకం

రహదారులకు ఇరువైపులా నాటి పెంచుతున్న వృక్షాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. రోజురోజుకూ భూముల విలువ పెరిగి పట్టాదారులు తమ భూముల హద్దులకు ఫెన్సింగ్‌లను, గోడలను నిర్మించుకుంటున్నారు. దాంతో రోడ్డుకు, పట్టాభూముల హద్దు మధ్యలో మిగిలిన కాస్త స్థలంలోనే మొక్కలను నాటాల్సి వస్తోంది. అదే స్థలంలో వ్యవసాయ, గ్రామ అవసరాలకు, పరిశ్రమల కోసం విద్యుత్ లైన్లు వేస్తున్నారు. అలాగే మిషన్ భగీరథ లాంటి తాగునీటి పైపులైన్లు, టెలిఫోన్ కేబుల్స్‌ను వేస్తున్నారు. విద్యుత్, తాగునీటి పైపులైన్లు, టెలిఫోన్ కేబుల్స్ వేసే సమయంలో చాలా చెట్లను తొలగిస్తున్నారు. అలాగే విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగులుతున్నాయని విద్యుత్ శాఖ అధికారులు వాటిని నరికిస్తున్నారు. మేకలు, గొర్రెల మేత కోసం కొందరు చెట్ల కొమ్మలను నరికి తీసుకెళ్తున్నారు. రోడ్ల విస్తరణ సమయంలో మహా వృక్షాలు సైతం రీప్లాంటేషన్ చేయకుండా తొలగిస్తున్నారు. దీంతో రహదారుల వెంట వృక్షాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది.

వృక్షజాతి మొక్కలే నాటాలి



ప్రభుత్వ నిబంధనల మేరకు వృక్షజాతి మొక్కలైన కానుగు, నేరేడు, మహఘని, పచ్చతురాయి, వేప, చింత, గుల్మోరా, అడవి బాదామ్ తదితర మొక్కలను నాటుతున్నాం. నాటిన మొక్కను మూడేళ్లు సంరక్షిస్తున్నాం. రోడ్లకు ఇరువైపుల పాత లైన్లే కాకుండా కొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటవుతున్నందున రహదా రి పక్కన చెట్ల కొమ్మలను నరికేస్తున్నారు. తాగునీటి పైపులైన్లు, టెలిఫోన్ లైన్లు, రోడ్డు విస్తరణ కోసం చెట్లను నరికేస్తున్నారు. విద్యుత్ లైన్లకింద నాటే మొక్క ల అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను.

- టి.అరుణరాణి, ఏపీవో, ఫరూఖ్‌నగర్

విద్యుత్ లైన్లను పరిగణనలోకి తీసుకుంటాం



విద్యుత్ లైన్లను పరిగణనలోకి తీసుకుని మొక్కలను నాటిస్తాం. వాటి కింద నాటిన మొక్కలు పెరిగి, విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గిస్తున్నాయి. ప్రమాదాలకు కారణమవుతున్న చెట్ల కొమ్మలను నరకాల్సి వస్తుంది. ఇక ముందు విద్యుత్తు లైన్ల కింద ఎత్తు పెరగని పూలు, పండ్ల మొక్కలు నాటడానికి చర్యలు తీసుకుంటాం. మున్సిపాలిటీలోని నర్సరీ మొక్కలు, హెచ్ఎండీఏ నుంచి వచ్చే మొక్కలను సరైన స్థలాల్లోనే నాటిస్తాం.

- సునీత, కమిషనర్, షాద్‌నగర్

చెట్ల కొమ్మలను నరకక తప్పడం లేదు



విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగించే చెట్ల కొమ్మలను నరికించక తప్ప డం లేదు. విద్యుత్ లైన్ల మధ్యలోకి పెరిగిన చెట్ల కొమ్మలు గాలి దుమారం, వర్షాలు వచ్చినప్పుడు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వినియోగదారులకు, విద్యుత్ శాఖకు నష్టం కలుగుతోంది. షాద్‌నగర్ డివిజన్‌లో 145 ఫీడర్లు ఉన్నాయి. ప్రతీ ఫీడర్‌కు ఏటా ఆరువేలు కాంట్రాక్ట్ ఇచ్చి కొమ్మలను నరికిస్తున్నాం. నాలుగైదు మీటర్లలోపు పెరిగే మొక్కలు నాటిస్తే మేలు.

- శ్యాంసుందర్‌రెడ్డి, డీఈ, ట్రాన్స్‌కో, షాద్‌నగర్

క్రైం కార్నర్

యువకుడు ఆత్మహత్య

కేశంపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెందిన యువకుడు క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కేశంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని చోటుచేసుకుంది. సీఐ నరహరి తెలిపిన వివరాల ప్రకారం.. తలకొండపల్లి మండలం వెంకటపూర్ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం వెంకటపూర్ తండాకు చెందిన మద్దూరి నరేశ్(26) 7 నెలల క్రితం తన తండ్రి అంజయ్య చనిపోవడంతో జీవితంపై విరక్తి చెంది.. తరచూ తాను కూడా చనిపోతానని కుటుంబ సభ్యులతో అనేవాడు. అలా చేయొద్దని కుటుంబ సభ్యులు వారించేవారు. ఈ క్రమంలో ఈనెల 2న కేశంపేటలో ఉండే నరేశ్ అక్క మాధవి ఇంటికి వెళ్లాడు. 3న రాత్రి ఇంట్లో ఎవరూ లేనిది గమనించి, క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన మాధవి కుటుంబ సభ్యులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు సీఐ తెలిపారు. మృతుడి తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సంపులో పడి వ్యక్తి మృతి

ఆదిభట్ల, జూలై 5(ఆంధ్రజ్యోతి): సంపులో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కయంజాల్ మున్సిపాలిటీకి చెందిన కొమ్మని గిరిబాబు(36) ఇంటిముందు ఉన్న వాటర్‌లేని సంపులో కాలుజారి పడిపోవడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వనస్థలిపురంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల రికవరీ

కడ్తాల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): కడ్తాల పోలీసు స్టేషన్ పరిధిలో ఇద్దరు వ్యక్తులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో కనుగొని శనివారం వారికి అప్పగించారు. సీఐ గంగాధర్ తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్‌కు చెందిన నాగేందర్ మైసిగండిలో, కడ్తాలకు చెందిన ఆదిత్య మండల కేంద్రంలో ఇటీవల సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నారు. దీంతో ఆ ఇద్దరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కడ్తాల పోలీసుల సహకారంతో సీఈఐఆర్ పోర్టల్‌లో దరఖాస్తు చేయగా పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నాగేందర్ ఫోన్‌ను కడపలో, ఆదిత్య ఫోన్‌ను కడ్తాలలో స్వాధీనం చేసుకొని బాధితులు ఆదిత్య, నాగేందర్‌లకు సీఐ గంగాధర్ అందజేశారు. ఎస్‌ఐలు వరప్రసాద్, చంద్రశేఖర్, ఏఎస్‌ఐ బాల్‌రెడ్డి, కానిస్టేబుల్ రామకోటి, సిబ్బంది పాల్గొన్నారు.


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సబితారెడ్డి, కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న పట్నం మహేందర్‌రెడ్డి, యాదయ్య, మధుసూదన్‌రెడ్డి

యాదమ్మ సేవలు చిరస్మరణీయం

చేవెళ్ల, జూలై 5(ఆంధ్రజ్యోతి): సీనియర్ నేత ముడిమ్యాల గ్రామానికి చెందిన పడాల వెంకటస్వామి సతీమణి.. మాజీ ఎంపీపీ, మాజీ జడ్పీటీసీ పడాల యాదమ్మ (65) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న తెలంగాణ ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కావలి చంద్రశేఖర్, బీజీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు దేశమళ్ల ఆంజనేయులు, ప్రభాకర్, గోవర్ధన్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. పడాల యాద మ్మ మండలానికి చేసిన సేవలను ఈ సందర్భంగా వారు కొనియాడారు.

ఓటరు జాబితాను తప్పుల్లేకుండా సిద్ధం చేయాలి


బీఎల్వోలకు సూచనలిస్తున్న తహసీల్దార్ జగదీశ్వర్

చౌదరిగూడ, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాను బీఎల్వోలు క్షుణ్ణంగా పరిశీలించి, తప్పులు లేకుండా సిద్ధం చేయాలని జిల్లేడ్ చౌదరిగూడ తహసీల్దార్ జగదీశ్వర్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో బీఎల్వోలకు ఓటర్ల జాబితాపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఓటర్ల జాబితాపై పలు సూచనలు చేశారు. ఓటర్ల జాబితాల్లో ఉన్న పొరపాట్లను సరిచేసి తప్పులు లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. ఓటరు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ఓటును మార్చుకునే వారితో పాటు ఓటరు జాబితాలో పేరు లేని వారిని గుర్తించాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన వారిని గుర్తించి కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎంటీ ఇమాన్యుయేల్, డిప్యూటీ తహసీల్దార్లు బాలవర్ధన్, భాస్కర్, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది రాజు, రామస్వామి, వెంకటేష్, ప్రవీణ్, బీఎల్వోలు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగులు

శంకర్‌పల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జాతీయ వికలాంగుల హక్కుల వేదిక చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షుడు కాసాల యాదయ్య డిమాండ్ చేశారు. దివ్యాంగుల పెండింగ్ పెన్షన్ చెల్లించాలని, వికలాంగుల కార్పొరేషన్‌ను బలోపేతం చేయాలని కోరుతూ ఆయన శనివారం శంకర్‌పల్లి డిప్యూటీ తహసీల్దార్ బాలకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెండింగ్ పెన్షన్‌లు మంజూరు చేయకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. అదేవిధంగా వికలాంగుల కార్పొరేషన్‌ను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామపంచాయతీ, మండల, జిల్లా పరిషత్, మున్సిపాలిటీలలో దివ్యాంగులు ప్రాతినిధ్యం కల్పించేందుకు అసెంబ్లీలో చట్ట సవరణ చేయాలని ఆయన కోరారు. దేశంలో ఇప్పటికే తమిళనాడు, రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలలో దివ్యాంగులకు స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం కల్పిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. కార్యక్రమంలో జంగయ్య, శ్రీనివాస్, కుమార్, దత్తు, శీతల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

యువత ఆర్థికంగా ఎదగాలి

చేవెళ్ల, జూలై 5(ఆంధ్రజ్యోతి): యువత స్వయం ఉపాధి రంగాలను ఎంచుకొని ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. అంతారం గ్రామ స్టేజ్ వద్ద నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్, సంతోష్‌గౌడ్‌లు ఏర్పాటు చేసిన ఓ కేఫ్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి రంగాలను ఎంచుకోవాలని సూచించారు. పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు బండారి ఆగిరెడ్డి, మార్కెట్ డైరెక్టర్ నరేందర్, మాజీ ఎంపీపీ రాములు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధికే రంగారెడ్డిపై ఆరోపణలు


సమావేశంలో మాట్లాడుతున్న గురునాథ్‌రెడ్డి

ఆదిభట్ల, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాజకీయంగా లబ్ధి పొందేందుకు ఎమ్మెల్యే రంగారెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి అన్నారు. శనివారం ఆదిభట్ల మున్సిపల్ పరిధిలోని బొంగ్లూర్ గేట్ వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని మంచాల మండలం లింగంపల్లి గేట్ వద్ద నిర్మించిన డబుల్ బెడ్‌రూంలను సందర్శించిన సందర్భంగా మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఎమ్మెల్యే రంగారెడ్డిపై ఆరోపణలు చేయడం సిగ్గు చేటన్నారు. 15 ఏళ్లు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా పనిచేసిన మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నియోజకవర్గానికి ఒక్క డబుల్ బెడ్‌రూం తీసుకురాలేదన్నారు. 2019లో మొదలు పెట్టిన డబుల్ బెడ్‌రూం పనులు నేటికీ కాంట్రాక్టర్ పూర్తి చేయలేదని, దాంతో ఎమ్మెల్యే రంగారెడ్డి రూ.30 లక్షలు నిధులు మంజూరు చేశారని గుర్తుచేశారు. డబుల్‌బెడ్‌రూంలలో తాగునీటి సౌకర్యంతో పాటు విద్యుత్, డ్రైనేజీ పనులు పెండింగ్‌లోనే ఉన్నాయని, అన్నింటినీ పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసిందన్నారు. ఎమ్మెల్యే రంగారెడ్డి వందల కోట్ల నిధులు తీసుకొచ్చి ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకనే రాజకీయ లబ్ధి కొరకు ఆరోపణలు చేయడం మంచిరెడ్డికి సరికాదన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కరుణాకర్, మాజీ జడ్పీటీసీ మహిపాల్, ఏబ్లాక్ అధ్యక్షుడు పాండురంగారెడ్డి, రవీందర్‌రెడ్డి, బాల్‌రాజ్, దాసు, వెంకటేశ్వర్లు, అయిలయ్య, పయిళ్ల శ్రీనివాస్‌రెడ్డి, రామరావు, ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు


భూమిపూజ అనంతరం ప్రొసీడింగ్ ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

తలకొండపల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఇందిరమ్మ పథకంతో నిరుపేదల సొంతింటి కల సాకారం అవుతుందన్నారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి గ్రామంలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి ప్రొసీడింగ్‌లు అందజేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి ఇళ్ల నిర్మాణం చేసుకోవాలని సూచించారు. నాయకులు డేవిడ్, రే ణురెడ్డి, శివకుమార్ గౌడ్,రాజశేఖర్, అంజయ్య, మశ్చందర్, రాహుల్, శశిపాల్‌రెడ్డి, రమేశ్, పాండు, బక్కయ్య, తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి


మొగుళ్లవంపులో కూలీలతో మాట్లాడుతున్న పుష్ప

యాచారం/ఇబ్రహీంపట్నం, జూలై 5(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టం పరిరక్షణ కోసం ఈనెల 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు పుష్ప తెలిపారు. శనివారం ఆమె యాచారం మండలంలోని మొగుళ్లవంపు గ్రామంలో ఉపాధి కూలీలతో మాట్లాడారు. కూలీలకు వరంగా ఉన్న ఉపాధి చట్టాన్ని పూర్తిగా రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయన్నారు. నేటికీ కూలీలకు గడ్డపార, టెంట్, తాగునీటి వసతి కోసం బిల్లులు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే డిమాండ్ల సాధన కోసం ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ ఇబ్రహీంపట్నం మున్సిపల్ కన్వీనర్ సీ.హెచ్ ఎల్లేష్ కోరారు. శనివారం ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26,000 ఇవ్వాలని, ప్రతీ కార్మికుడికి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కొత్తగా విధుల్లోకి తీసుకున్న కార్మికులకు నెలకు రూ.16,000 వేతనం ఇవ్వాలన్నారు. కార్మికులకు వారాంతపు సెలవులు ఇవాలన్నారు. మెప్మా రిసోర్స్ కార్మికులకు కూడా నెలకు రూ.26,000 వేతనంగా ఇవ్వాలని తమ డిమాండ్లలో ఉందన్నారు. కమిషనర్‌ను కలిసిన వారి లో సీఐటీయూ మండల కన్వీనర్ చందునాయక్, మున్సిపల్ అధ్యక్షుడు పెద్దిగారి లక్ష్మయ్య, కార్యదర్శి బండారి యాదయ్య, భాగ్య, స్వప్న, అండాలు తదితరులు ఉన్నారు.


కమిషనర్ సత్యనారాయణరెడ్డికి సమ్మె నోటీసు ఇస్తున్న సీఐటీయూ నాయకులు

ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడిగా ప్రవీణ్


ప్రవీణ్‌కు నియామకపత్రం ఇస్తున్న వెంకటేశం గుప్తా తదితరులు

మంచాల, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం మంచాల మండల కమిటీ ఎన్నిక శనివారం నిర్వహించారు. స్థానిక మల్లికార్జున ఫంక్షన్‌హాల్‌లో జరిగిన సమావేశంలో ఆర్యవైశ్య సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వెంకటేశం గుప్త ఎన్నికల పరిశీలకుడిగా వ్యవహరించారు. మండల కమిటీ నూతన అధ్యక్షుడిగా రాచమల్ల ప్రవీణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా కోశాధికారి వనపర్తి బద్రీనాథ్‌గుప్త, చీకటిమల్ల హన్మంతు, బిలకంటి బాలాజి, చంద్రమౌళి, సాతెల్లి శ్రీను, కండె మల్లేష్, విడియాల వెంకన్న తదితరులున్నారు.

పెంపుడు జంతువులపై శ్రద్ధ వహించాలి


షాబాద్‌లో కుక్కకు టీకా వేస్తున్న డాక్టర్ స్రవంతి

షాబాద్/ఇబ్రహీంపట్నం, చేవెళ్ల, జూలై 5(ఆంధ్రజ్యోతి) పెంపుడు జంతువులను శ్రద్ధగా చూసుకుంటూ జాగ్రత్తగా పరిరక్షించాలని షాబాద్, చేవెళ్ల, ఆలూర్ పశువైద్యాధికారులు స్రవంతి, శిరీష, దేవేందర్‌రెడ్డిలు అన్నారు. జూలై 6న వరల్డ్ జునోసిస్ డే సందర్భంగా షాబాద్‌లో పెంపుడు జంతువులకు టీకాలు వేశారు. చేవెళ్ల, ఆలూర్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. జునోసిస్ డిసీజ్ అనేవి అంటువ్యాధి అని అన్నారు. పెంపుడు జంతువుల పెంపకంతో చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. జునోసిస్ డే సందర్భంగా నేడు(ఆదివారం) పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం పశువైద్యశాలలో కుక్కలకు, పెంపుడు పిల్లులకు రేబిస్ నివారణ టీకాలు వేస్తున్నట్లు పశువర్ధక శాఖ సహాయ సంచాలకులు డా.వసంతకుమారి, పశు వైద్యాధికారులు డా.ఆనంద్‌రెడ్డి, డా.రిషితలు తెలిపారు. పెంపుడు జంతువుల పెంపకందారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు.

కేశంపేట ఎంపీపీ కార్యాలయంలో 'డిజిటల్ అటెండెన్స్'

కేశంపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నుంచి డిజిటల్ అటెండెన్స్‌ను అధికారులు ప్రారంభించారు. కార్యాలయంలో ఎంపీవో కార్యాలయం ముందు ఫేస్ రికగ్నిషన్, బయోమెట్రిక్ డివైస్‌ను ఏర్పాటు చేశారు. ప్రతీ ఉద్యోగికి సంబంధించిన వివరాలు ఇందులో నమోదు చేశారు. ప్రతీరోజు వారు విధి నిర్వహణకు సంబంధించి హాజరును పరిశీలించనున్నారు. దీంతో కార్యాలయంలో ఉద్యోగుల హాజరులో కచ్చితత్వం ఏర్పడనుంది. కార్యాలయంలో ఫేస్ రికగ్నిషన్, బయోమెట్రిక్ డివైస్ ఏర్పాటు చేయడంతో ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. డివైస్ ఏర్పాటుతో విధులకు ఎగనామం పెట్టే వారికి చెక్ పడినట్లు అయిందని వారు తెలిపారు.

రిఫ్రిజిరేటర్ వితరణ

కేశంపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి పశువైద్య ఉప కేంద్రానికి బీఆర్ఎస్ నాయకుడు రిఫ్రిజిరేటర్ వితరణ చేశారు. గ్రామ పశువైద్య ఉప కేంద్రంలో జీవాలకు ఇవ్వాల్సిన మందులను నిల్వచేయడానికి రిఫ్రిజిరేటర్ లేకపోవడంతో, రైతులు పడుతున్న ఇబ్బందులు గమనించిన గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కానం ప్రేమ్‌కుమార్ గౌడ్ శనివారం లైవ్‌స్టాక్ అసిస్టెంట్ రాజుకు రిఫ్రిజిరేటర్‌ను అందించారు. జీవాలను మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో మల్లయ్య, దశరథ్, మహ్మద్, నరేష్, ఖాజాపాషా, శ్రీనివాస్, కుమార్, సత్యం, సాబేర్, అరవింద్, మాధవులు, శ్రీశైలం, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.


రిఫ్రిజిరేటర్‌ను అందిస్తున్న ప్రేమ్‌కుమార్ గౌడ్

245వ రోజుకు చేరిన రిలే దీక్షలు

తలకొండపల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం అవసరమైతే ఆమరణ నిరహార దీక్ష ప్రారంభిస్తామని గట్టిప్పలపల్లి జేఏసీ నాయకులు ప్రకటించారు. గట్టిప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు శనివారం 245వ రోజుకు చేరాయి. మాజీ సర్పంచ్ జయమ్మ వెంకట య్య, బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్‌చైర్మన్ శరత్‌చం ద్ర, ఆంజనేయులుగౌడ్, కార్యదర్శి అనిల్ ఉన్నారు.

సొంత డబ్బుతో రోడ్డు మరమ్మతులు



తలకొండపల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): మాజీ సర్పంచ్ చొరవతో వర్షాలకు దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతు చేశారు. దీంతో పొలాలకు వెళ్లడానికి రైతులకు ఇబ్బందులు తొలగిపోయాయి. దేవుని పడకల్ రైతులు పంట పొలాలకు, వైకుంఠధామానికి వెళ్లే మట్టిరోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు బురద రొంపుగా మారింది. రాకపోకలకు రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూ వచ్చారు. మాజీ సర్పంచ్ కాడేమోని శ్రీశైలం దృష్టికి తీసుకుపోయారు. స్పందించిన శ్రీశైలం, రూ.26,500 లతో రోడ్డుపై మొరం పోయించి శనివారం చదును చేయించారు. భిక్షపతి, శంకర్, కృష్ణ, స్వామి, వేణు, శ్రీను, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.